సాక్షి తిరుపతి

సోమవారం । 29 । మే । 2023



ఇంటి వద్దే కూల్‌గా..

వేసవిలో ఆరోగ్య రక్షణకు ఇంటి వద్దే పానీయాలు, జ్యూస్‌లు తయారు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. - 8లో



కొండంత క్యూ

తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోవడంతో క్యూలో వేచి ఉన్నారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	40	27
చిత్తూరు	40	26
తిరుమల	36	23
గూడూరు	42	28
నగరి	42	28

న్యూస్‌రీల్

ఏపీపీజీఈసెట్-2023 ప్రారంభం



కోడ్ విడుదల చేస్తున్న వీసీ రాజారెడ్డి తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఎంటెక్, ఎం ఫార్మసీ, ఫార్మా డీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీపీజీఈసెట్-2023ని ఆదివారం పరీక్షల చైర్మన్, ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ కె.రాజారెడ్డి కోడ్‌ను విడుదల చేసి ప్రారంభించారు. మొత్తం 13సబ్జెక్టుల్లో మూడు రోజుల పాటు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలను నిర్వహించనున్నారు. తొలిరోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఫార్మసీ, జియో ఇంజినీరింగ్, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5గంటల వరకు కంప్యూటర్ సైన్స్ పరీక్షలు జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 3,300మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు కన్వీనర్, ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఆర్వీఎస్ సత్యనారాయణ తెలిపారు. ప్రొఫెసర్లు శ్రీనివాసులు, దివాకర్ రెడ్డి, గోపి, శివ, ఉదయ్, సుబ్రమణ్యం పర్యవేక్షించినట్లు వెల్లడించారు.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందించాలని సూచించారు. వినతులు రాసేందుకు ప్రత్యేకంగా ముగ్గురు వీఆర్‌ఓలను నియమించినట్లు వివరించారు. స్పందనకు అన్నిశాఖల ఉన్నతాధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అబ్జర్వర్ ప్రద్యుమ్న

తిరుపతి అర్బన్ : నగరంలోని 13 కేంద్రాల్లో ఆదివారం యూపీఎస్సీ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించినట్లు అబ్జర్వర్, ఆర్‌అండ్‌బీ కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న తెలిపారు. కలెక్టర్ వెంకటరమణారెడ్డి నేతృత్వంలో ప్రణాళికాబద్ధంగా పరీక్షలు జరిపించినట్లు వెల్లడించారు. ముందస్తు సమావేశాలతో అధికారులకు కచ్చితమైన విధులు కేటాయించామన్నారు. ఉదయం 9:30 నుంచి 11:30 వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి 4:30 గంటల వరకు రెండు సెషన్లలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించినట్లు తెలిపారు. ఢిల్లీ నుంచి వచ్చిన ఇద్దరు అధికారులు సైతం పరీక్షలను పర్యవేక్షించినట్లు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం 3,358 మంది, మధ్యాహ్నం 3,329 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరైనట్లు వెల్లడించారు. పరీక్ష పత్రాల కస్టోడియన్‌గా తిరుపతి ఆర్డీఓ వి.కనకనరసారెడ్డి విధులు నిర్వర్తించారన్నారు. పోలీస్, రెవెన్యూ, ఆర్టీసీ, విద్యుత్ అధికారులు సమష్టిగా కృషి చేశారని తెలిపారు. పరీక్షల అనంతరం ఓఎంఆర్‌లను ప్రధాన పోస్టల్ కార్యాలయానికి చేర్చినట్లు వివరించారు.

బీజేపీతో బీసీలకు ఒరిగింది శూన్యం



మాట్లాడుతున్న శ్రీనివాస్ గౌడ్

తిరుపతి కల్చరల్ : బీజేపీ ప్రభుత్వంతో బీసీలకు ఒరిగింది శూన్యమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. ఆదివారం తిరుపతిలోని శ్రీలక్ష్మీ శ్రీనివాస గ్రౌండ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని అన్ని పార్టీలు బీసీ కులగణనకు అనుకూలంగా ఉన్నాయని, ఇప్పటికైనా ప్రక్రియ చేపట్టకుంటే బీజేపీకి ఇవే చివరి ఎన్నికలవుతాయని హెచ్చరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు మాట్లాడుతూ కర్ణాటక ఎన్నికల తరహాలోనే దేశవ్యాప్తంగా బీసీలు బీజేపీకి బుద్ధి చెబుతారన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు గౌడ్ మాట్లాడుతూ ఆగస్టు 7న తిరుపతిలో 11వ జాతీయ ఓబీసీ మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో బీసీ నేతలు క్రాంతికుమార్, కిరణ్‌కుమార్ ఆచార్య పాల్గొన్నారు.

తీరం.. వసతుల హారం

కనుచూపు మేర అనంత జలాలు.. మెత్తటి ఇసుక తిన్నెలు.. సరుగుడు తోటల సవ్వడులు.. హాయి గొలిపే చల్లటి గాలులు.. ఎగసిపడే కెరటాలతో సాగర తీరం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఆహ్లాదకర వాతావరణాన్ని సందర్శకులు ఆస్వాదించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. ప్రకృతి రమణీయతకు తోడుగా అత్యాధునిక వసతులు కల్పించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది. అందులో భాగంగా తొలుత జిల్లాలోని 8 బీచ్‌లను గుర్తించింది. ఆయా ప్రాంతాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి పర్యాటక ఆదాయాన్ని పెంచుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఈ మేరకు అధికార యంత్రాంగం పకడ్బందీగా కసరత్తు చేస్తోంది. త్వరలోనే సముద్ర తీరం.. సకల సౌకర్యాలతో స్వర్గధామంగా కనువిందు చేయనుంది.



తూపిలిపాళెం బీచ్‌లో పర్యాటకుల సందడి (ఫైల్)

- జిల్లాలో 8 బీచ్‌ల అభివృద్ధికి ప్రణాళిక
- నివేదికలు సిద్ధం చేస్తున్న టూరిజం శాఖ
- పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా అడుగులు
- సకల వసతులు కల్పించేందుకు సన్నాహాలు
- భూ కేటాయింపునకు కసరత్తు చేస్తున్న అధికారులు

ఏపీ నెట్‌వర్క్ : తిరుపతి జిల్లాలో చిల్లకూరు మండలం నుంచి తడ వరకు సుమారు 75 కిలోమీటర్ల మేర సముద్ర తీరం విస్తరించి ఉంది. పొరుగునే ఉన్న పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలంలో కృష్ణపట్నం పోర్టు ఉండగా, వాకాడు మండలంలో బ్రిటీష్ కాలంలో నిర్మించిన లైట్ హౌస్ ఠీవిగా నిలబడి ఉంది. సూళ్లూరుపేట, తడ మండలాల పరిధిలో పులికాట్ సరస్సు పర్యాటక కేంద్రంగా ఆకట్టుకుంటోంది. అలాగేగ దొరవారిసత్రంలోని నేలపట్టు పక్షుల కేంద్రం ఎల్లప్పుడూ సందర్శకులతో సందడిగా ఉంటుంది. సమీపంలోని భీములవారిపాళెంలో పడవలో విహార యాత్ర చేసే వసతిని టూరిజం శాఖ కల్పించింది. ఇలా తీర ప్రాంతంలో ఏడాది పొడవునా పర్యాటకులకు ఆహ్లాదం పంచే ప్రాంతాలు విశేషంగా ఉన్నాయి. ఈ క్రమంలోనే పలు బీచ్‌లను కూడా అభివృద్ధి చేసి మరింతగా సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం పకడ్బందీగా ప్రణాళిక సిద్ధం చేస్తోంది.

అభివద్ధికి కసరత్తు

పర్యాటకులను ఆకర్షించే క్రమంలో పర్యాటక శాఖ జిల్లాలోని 8 బీచ్‌లను అభివృద్ధి చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ముందుగా వాకాడు మండలంలోని తూపిలిపాళెం, కోట మండలంలోని శ్రీనివాససత్రం బీచ్‌లను సకల వసతులతో తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా ఇటీవల టూరిజం శాఖకు చెందిన అధికారులు ఆయా బీచ్‌లను సందర్శించారు. అక్కడి స్థితి గతులను పరిశీలించి నివేదికలను సైతం సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలోనే జాయింట్ కలెక్టర్ బాలాజీ, గూడూరు ఆర్డీఓ కిరణ్ కుమార్ సైతం ఇటీవలే తూపిలిపాళెంలో పర్యటించారు. అభివృద్ధి పనులకు అవసరమైన సుమారు 3.25 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. భూ కేటాయింపులు పూర్తయిన వెంటనే నిర్మాణాలు చేపట్టేందుకు నిధులు విడుదల చేస్తామని పర్యాటక శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.

ఎంపికైన బీచ్‌లు ఇవే..

చిల్లకూరు మండలంలోని తీగపాళెం, కోట మండలం శ్రీనివాససత్రం, వాకాడు మండలంలోని తూపిలిపాళెం, ఓడపాళెం, (లైట్ హౌస్), వైట్ కుప్పం, పూడి కుప్పం, శ్రీనివాసపురం, నవాబుపేట బీచ్‌లను అభివృద్ధి చేసేందుకు అధికారులు ఎంపిక చేశారు. ఈ ప్రాంతాలు ఇప్పటికే పర్యాటకులతో నిత్యం సందడిగా ఉంటాయి. అతిథిగృహాలు, జల విహారానికి బోట్లు, ఇతర వసతులు సమకూరిస్తే మరింతగా ఆకట్టుకునే అవకాశముంటుంది. ప్రస్తుతం నవాబుపేటలో జెట్టి ఏర్పాటు చేస్తున్నారు. 50 సెంట్ల భూమిని సైతం కేటాయించారు.



వాకాడు మండలం తూపిలి పాళెం వద్ద స్థల పరిశీలనలో జేసీ బాలాజీ, ఆర్డీఓ కిరణ్‌కుమార్ (ఫైల్)



తీర ప్రాంతంలో వసతుల కల్పనకు అవకాశాలను పరిశీలిస్తున్న టూరిజం. మత్స్యశాఖ అధికారులు

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం

సముద్ర తీరం వెంబడి ఇప్పటికే 8 బీచ్‌లను అభివృద్ధి చేసేందుకు గుర్తించాం. ఆయా ప్రాంతాల్లో భూములు కేటాయించాలని రెవెన్యూశాఖను కోరాం. వారు భూములు అప్పగించిన అనంతరం నిధులు విడుదల చేస్తాం. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు బీచ్‌లను అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించాం.

– రూపేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా పర్యాటకశాఖాధికారి, తిరుపతి

వసతులు కల్పిస్తే చాలు



చిల్లకూరు మండలంలోని తీగపాళెం బీచ్‌కు ప్రతి ఆదివారం పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. తూర్పు కనుపూరులో ముత్యాలమ్మను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు బీచ్ వద్దకు వెళ్లి పుణ్యస్నానాలు చేస్తుంటారు. తీర ప్రాంతానికి వెళ్లేందుకు రోడ్డు నిర్మించడంతో పాటు మరిన్ని వసతులు కల్పిస్తే చాలు.. పెద్ద సంఖ్యలో సందర్శకులు వచ్చే అవకాశముంటుంది.

– శ్రీనివాసులు, మోమిడి, చిల్లకూరు మండలం

అభివృద్ధికి అవకాశం



వాకాడు మండలంలోని తూపిలిపాళెం బీచ్ వద్ద సముద్రం తీర ప్రాంతం లోతు తక్కువ ఉంటుంది. అందుకే పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో తరలి వస్తుంటారు. గతంలో ఇక్కడ అతిథిగృహం ఉండేది. నిర్వహణలోపంతో శిథిలావస్థకు చేరింది. ఈ ప్రాంతం అభివృద్ధికి అనుకూలంగా ఉంటుంది. వసతులు కల్పిస్తే నిత్యం పర్యాటలకులతో కళకళలాడుతుంది.

– సోమయ్య, వాకాడు మండలం తూపిలిపాళెం

ఆనందంగా ఉంది



తూపిలిపాళెం అభివృద్ధికి అనువుగా ఉంటుంది. పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం సన్నద్ధం కావడం ఆనందంగా ఉంది. ఇక్కడ వసతులు కల్పిస్తే చుట్టు పక్కల గ్రామాలు కూడా అభివృద్ధి దిశగా పయనిస్తాయి. స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అధికారులు సైతం అన్ని విధాలుగా ఈ ప్రాంతం అనుకూలంగా ఉంటుందని నిర్ణయించారు.

– వీవీ రమణయ్య, వైస్ ఎంపీపీ, తూపిలిపాళెం

ముస్లింలతో వైఎస్సార్ సీపీకి మరింత బలం



పుంగనూరులో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ ముస్లిం నేతలతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన పులిచెర్ల టీడీపీ నాయకులు

పుంగనూరు: ముస్లిం మైనారిటీలు వైఎస్సార్ సీపీలోకి పెద్ద ఎత్తున చేరుతుండడంతో పార్టీ మరింత బలోపేతం అవుతోందని మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 100 మందికి పైగా తెలుగుదేశం కార్యకర్తలు ఆదివారం నాయకుడు అస్లాంమురాధి ఆధ్వర్యంలో మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పట్టణంలోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముస్లింలు మహమ్మద్, మన్సూర్, రిజ్వాన్, ఉస్మాన్, ఫరాజ్, అసిఫ్, నయాజ్, మున్నా, నూర్ మహమ్మద్, మహమ్మద్‌వారీస్, ఎంఎస్.వసీమ్, సుహేల్‌మాలిక్ తదితరులకు మంత్రి పెద్దిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మైనారిటీలు అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరుతుండం హర్షణీయమన్నారు. ప్రతి ఒక్కరికీ పార్టీలో తగిన గుర్తింపు ఇస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, మైనారిటీ సెల్ రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జ్ ఫకృద్దిన్‌షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పులిచెర్ల టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీలోకి..

పులిచెర్ల(కల్లూరు): మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో ఆదివారం పులిచెర్లకు చెందిన టీడీపీ నాయకులు వెంకటనారాయణ రెడ్డి, చిన్నబ్బ వారి అనుచరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. తిరుపతిలోని మంత్రి పెద్దిరెడ్డి స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో వీరికి కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి. మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు నాగరాజ ప్రసాద్, ప్రభాకర్, గోవర్ధన్, రమణారెడ్డి, రవీంద్రారెడ్డి, నాగిరెడ్డి, శ్రీధర్, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

సింహ వాహనంపై అనంతతేజం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం ఉదయం అనంతతేజోమూర్తిగా శ్రీవారు సింహ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. గజరాజులు వెంట నడుస్తుండగా, భక్తజన బృందాల కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవను వైభవంగా నిర్వహించారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. అనంతరం ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత గోవిందరాజస్వామి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం చేపట్టారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనాలతో అభిషేకం చేశారు. సాయంత్రం 5.30 నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు ముత్యపు పందిరి వాహనంపై స్వామి వారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో కంకణభట్టార్ ఏపీ శ్రీనివాస దీక్షితులు, ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ రవికుమార్, సూపరింటెండెంట్ మోహనరావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయులు పాల్గొన్నారు.



సింహవాహనంపై ఊరేగుతున్న గోవిందరాజస్వామి





స్వామివారి వాహన సేవలో కళా ప్రదర్శనలు

వలంటీర్ల సేవలకు వందనం

- 1,900 మందిని సత్కరించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి
- పురస్కారాలతో రూ.1.91 కోట్లు పంపిణీ



కార్యక్రమానికి హాజరైన వలంటీర్లు



వలంటీర్లకు స్వీట్లు అందిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : అభివృద్ధి.. సంక్షేమ పథకాల అమలులో చంద్రగిరి నియోజకవర్గాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దడంతో వలంటీర్ల పాత్ర కీలకమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కొనియాడారు. ఆదివారం తిరుపతి ఎస్వీయూ ఆడిటోరియంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నియోజకవర్గంలోని మొత్తం 1,900 మంది వలంటీర్లను ఘనంగా సత్కరించారు. ప్రజలకు ఉత్తమ సేవలందించినందుకు సేవామిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలను అందజేశారు. ప్రోత్సాహకంగా రూ.1.91 కోట్లు పంపిణీ చేశారు. చెవిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే చంద్రగిరి అతి పెద్ద నియోజకవర్గమన్నారు. అందుకే వలంటీర్ల సంఖ్య కూడా అధికంగా ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా వలంటీర్లు ప్రజా సేవలో విశేష ప్రతిభ కనబరిచారని ప్రశంసించారు. అందుకే వాళ్లని కుటుంబసభ్యులుగా చూస్తామని వెల్లడించారు. వలంటీర్లకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా ఒక్క అన్నలా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. ప్రజా సేవలో విశేషంగా కృషి చేసిన వలంటీర్లకు ప్రభుత్వం సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులను ప్రదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. పేదలకు నిత్యం అండగా ఉంటున్న వలంటీర్లకు ఆయన వందనం సమర్పించారు. కోవిడ్ సమయంలో అందరూ ప్రాణభయంతో ఇంట్లోనే ఉండిపోతే, వలంటీర్లు మాత్రమే సేవలందించారని గుర్తుచేశారు. ఆ తరుణంలో ప్రజలను కాపాడుకునేందుకు కాయగూరలు, కోడిగుడ్లు, విటమిన్ ట్యాబ్లెట్లు, పండ్లు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశామన్నారు. 5వేల పడకలతో ప్రత్యేకంగా కోవిడ్ ఆస్పత్రిని సైతం ఏర్పాటు చేశామని వివరించారు. ప్రజలందరూ పండుగలను ఆనందంగా జరుపుకోవాలనే సదుద్దేశంతోనే నూతన వస్త్రాలు, స్వీట్లు, వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. తాము ఏపని చేపట్టినా క్షేత్రస్థాయిలో విజయవంతం చేసింది వలంటీర్లే అనే విషయాన్ని ఎన్నటికీ మరచిపోనని స్పష్టం చేశారు. ఎన్నికలు వచ్చినప్పుడు చాలా మంది ముందుకు వచ్చి మాయమాటలు చెబుతారని, ఎన్నికలతో పనిలేకుండా నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజల అవసరాలను గుర్తించి వారి ఇంటికే అన్నీ పంపుతున్నట్లు వివరించారు. తమ సంపాదనలో 75శాతం ప్రజలకే ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పదోతరగతి విద్యార్థుల్లో స్కూల్ ఫస్ట్ వచ్చిన వారికి ట్యాబ్‌లు, మండల స్థాయిలో టాపర్‌గా నిలిచిన వారికి ల్యాప్‌టాప్ లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత యువతను ప్రోత్సహించేందుకు 25రోజుల పాటు మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

జగనన్న మానసపుత్రికలు : మోహిత్‌రెడ్డి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన మానస పుత్రికలుగా గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలను రూపకల్పన చేశారని చంద్రగిరి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. రెండు వ్యవస్థలతో గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాకారమైందన్నారు. సంక్షేమ పథకాలను ప్రతి గుమ్మానికి చేర్చడంలో వలంటీర్ల కృషి అమోఘమని కొనియాడారు. అనంతరం అవార్డులు అందుకున్న వలంటీర్లకు మెడల్స్, ధ్రువీకరణ పత్రాలతో పాటు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రత్యేకంగా చెన్నై నుంచి తెప్పించిన స్వీట్లు పంపిణీ చేశారు.

23 మందికి ఎంపీడీఓలుగా పదోన్నతి

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్ర వ్యాప్తంగా 112 మంది ఈఓపీఆర్డీలు, పంచాయతీరాజ్ ఏఓలకు ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో 23 మందికి పదోన్నతి లభించింది. ఏఓ కేటరిలో నాగరాజు(పీలేరు), మహేష్(వి.కోట), గుణశేఖర్‌రెడ్డి(చంద్రగిరి ఎమ్మెల్యే ఓఎస్‌డీ), కర్నూలు జిల్లాలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న విజయ, బాలాజీ(జెడ్పీ కార్యాలయం, పీఎంఆర్ ప్రభాకర్(రామసముద్రం), శేషగిరిరావు(నగరి), భానుమూర్తిరావు(సదుం), సురేష్‌బాబు(చౌడేపల్లె), భాస్కర్(పెద్దపంజాణి), చలపతిరెడ్డి(చిత్తూరు పీఐయూ),తాజ్‌మసూర్(నిమ్మనపల్లె), ప్రేమ్‌రాజ్‌కుమార్(శ్రీకాళహస్తి)ఉన్నారు. ఈఓపీఆర్డీల పరంగా లీలామాధవి(నిమ్మనపల్లె), అబ్దుల్‌కలాంఆజాద్(వాయల్పాడు), చలపతిరావు(రామస ముద్రం), తిరుపతి జిల్లా నుంచి రాజశేఖర్, శ్రీనివాస రావు ఉన్నారు. ఉద్యోగన్నతి కల్పించినందుకు మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులకు ఏపీ పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పీఎంఆర్ ప్రభాకర్ ఓప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

ఇంటి వద్దే కూల్‌గా.. చిల్ అవుదాం

జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రత 42 డిగ్రీలు నమోదవుతోంది. ఉష్ణతాపాన్ని తీర్చే శీతల పానీయాలు, ఫ్రూట్ జ్యూస్‌లకు గిరాకీ ఏర్పడింది. కొబ్బరి బోండాలు మినహా వీధి దుకాణాలు, జ్యూస్ సెంటర్లలో అపరిశుభ్ర పండ్ల రసాలు, లస్సీ, ఇతర పానీయాలు తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు. 90 శాతం మంది వ్యాపారులు కలుషిత నీటితో తయారు చేసిన ఐస్‌ను వినియోగిస్తున్నారని, ఇది కలిపిన జ్యూస్‌లు తాగితే అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇంట్లోనే చిల్ అయ్యేందుకు కొన్ని రకాలైన పానీయాలు తయారు చేసుకోవచ్చునంటున్నారు. ఇవి ఆరోగ్యానికి మేలుచేయడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచుతుందని చెబుతున్నారు...అవేవో చూద్దాం...

- అనారోగ్యం కొనితెచ్చుకోవద్దు
- ఉమ్మడి జిల్లాలో మండే ఎండలు
- సుమారు 25 వేల కూల్‌డ్రింక్స్ దుకాణాలు
- 15 వేల వరకు వీధి వ్యాపారాలే
- శుభ్రతలేని జ్యూస్‌లు తాగితే అనారోగ్యమంటున్న వైద్య నిపుణులు
- ఇంట్లోనే తయారు చేసుకోవాలని సూచన



సాక్షి తిరుపతి/చిత్తూరు రూరల్ : వేసవి వచ్చిందంటే చాలా మంది చల్లని పానీయాలను ఆస్వాదిస్తారు. పలువురు రోడ్డు సైడ్ వైపు వాలిపోతుంటారు. అక్కడ కలరింగ్‌లు ఇచ్చే పానీయాలకు ఆకర్షితులవుతుంటారు. చల్లగా ఉందంటూ తెగ తాగేస్తుంటారు. ఇదే అవకాశంగా సీజనల్ దుకాణాలు కూడా భారీగా వెలుస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 25 వేల కూల్‌డింగ్స్, ఐస్‌క్రీమ్‌ల దుకాణాలు ఉన్నాయి. ఇందులో 15 వేల వరకు రోడ్‌సైడ్ వ్యాపారాలే ఉంటాయని అధికారిక గణాంకాలు. ఈ షాపుల వద్ద క్యూ కడుతున్నారు. చాలా మంది వీధి వ్యాపారులు, జ్యూస్ సెంటర్ల నిర్వాహకులు సరైన పరిశుభ్రత పాటించకుండా పండ్ల రసాలు, లస్సీ, నిమ్మరసం, సోడా తదితర పానీయాలను తయారు చేసి విక్రయిస్తుంటారు. వాటిల్లో వినియోగించే రసాయన పదార్థాల వల్ల ఫుడ్ పాయిజన్ అయ్యే ప్రమాదం లేకపోలేదంటున్నారు వైద్యులు. ఒక పక్క ఎండల తీవ్రతతో శరీరం నిర్జలీకరణకు గురవుతుండగా, మరో పక్క రంగుల పౌడర్లు, రుచికరమైన మిశ్రమ పదార్థాలు, ద్రావణాల ఈ మిశ్రమంతో కూడిన శీత పానీయాలను తీసుకోవడం వల్ల డయేరియాకు గురై, తీవ్ర అనారోగ్యం బారినపడే అవకాశాలున్నట్లు హెచ్చరిస్తున్నారు.

కలుషిత జ్యూస్‌లతో సమస్యలు ఇలా...

కలుషిత నీటితో తయారు చేసిన ఐస్‌ను తీసుకోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. 90 శాతం మంది వ్యాపారులు ప్రమాదకరమైన ఐస్‌ను వినియోగిస్తున్నారు. అందులో ఉండే సూక్ష్మక్రిముల వల్ల నీళ్ల విరేచనాలు అవుతాయి. బ్యాక్టీరియా వల్ల పారా టైఫాయిడ్, కలరా, వైరస్ వల్ల గ్యాస్ట్రిక్ సమస్యలు వేధిస్తాయి. ఇంకా పచ్చకామెర్లు, నారకురుపు, రక్తహీనత వంటి వ్యాధుల బారినపడే అవకాశముంది. ఆమ్లం, క్షారం ఎక్కువగా ఉంటే గ్యాస్ట్రిక్ ఇరిటేషన్ , ఎసిడిటీ సమస్యలు, కంటి, చర్మ, ముక్కు సంబంధిత సమస్యలు, గొంతు ఇన్ఫెక్షన్లు, థైరాయిడ్, సైనసైటిస్, జలుబు వంటివి కూడా వస్తాయి. నీటిలో రసాయనాలు ఉంటే దీర్ఘకాలిక వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశముంది. ఐస్‌కు వినియోగించే నీటిలో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉంటే ఫ్లోరోసిస్ (ఎముకలు గుల్ల బారడం), నైట్రేట్ ఎక్కువగా ఉంటే నీలి రంగులోకి మారడం, మాంగనీసు ఎక్కువగా ఉంటే మెదడు వాపు వ్యాధి, ఆర్సినిక్ ఉంటే కేన్సర్లు, శ్వాసకోశ వ్యాధుల బారినపడే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఇలా తయారు చేసుకుందాం...



వేసవిలో నిమ్మకాయ నీరు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇందులో ఫైబర్ ఉంటుంది, చల్లదనంతోపాటు, జీర్ణక్రియను బాగా ఉంచుతుంది. విటమిన్–సిని కలిగి ఉండడంతో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఉష్ణతాపాన్ని తగ్గించడంలో ఇది బాగా దోహదం చేస్తుంది.



మామిడి రసం వేడి నుంచి ఉపశమనం అందిస్తుంది. రోగనిరోధక శక్తిని బలపరిచే విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది. మామిడి రసంలో యాలకుల పొడి, రుచికి కాస్త పటిక బెల్లం కలపి తీసుకుంటే చాలా రుచిగా కూడా ఉంటుంది. ఆరోగ్యానికి మేలు కలిస్తుంది.



శరీరం హైడ్రేట్‌గా ఉంచాలంటే కొబ్బరి నీరును తప్పనిసరిగా తీసుకోవాలి. కొబ్బరి నీళ్లు తాగడం వల్ల జీర్ణవ్యవస్థ బాగా పని చేస్తోంది. కొబ్బరి నీళ్లలో చాలా తక్కువ కేలరీలు ఉంటాయి. ఈ ఫలితంగా ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. విటమిన్ సి, మెగ్నీషియం, పొటాషియం రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి.



లస్సీ చాలా ఉపయోగకరంగా ఉంటుంది. అందులోనూ పుదీనా లస్సీ కడుపును చల్లగా ఉంచుతుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, మినరల్స్, విటమిన్లు ఏ, సీ, ఈ ఉన్నాయి. ఇవన్నీ రోగనిరోధక శక్తిని పెంచుతాయి. పెరుగులో శరీరానికి మేలు చేసే ప్రో–బయోటిక్స్ ఉంటాయి. ఇలా తీసుకోవడం వల్ల వడదెబ్బ, వేసవి తాపం నుంచి బయట పడవచ్చు.



వేడిని అధిగమించడానికి పుచ్చకాయ జ్యూస్ కూడా తాగవచ్చు. ఇది రుచికరంగా ఉంటుంది. ఆరోగ్యకరమైంది ఈ రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఈరసంలో కొంత నల్ల ఉప్పుతో పాటు చక్కెర కలపి తీసుకోవచ్చు. పుదీనాను జోడించవచ్చు.

జాగ్రత్తలు పాటించాలి

వేసవిలో బయటకు వెళ్లినప్పుడు వెంట తాగునీటి బాటల్ తీసుకెళ్లడం ఉత్తమం. వీధులపై విక్రయించే చల్లటి పానియాలు, జ్యూస్‌లు వంటి వాటికి దూరంగా ఉండాలి. ఎండలో తిరిగి వచ్చిన వెంటనే ఒక్కసారిగా చల్లటి నీరు తాగడం గాని, కూల్‌డ్రింక్స్, జ్యూస్‌లు, ఇతర చల్లటి పదార్థాలను తీసుకున్నా గొంతు నొప్పి వస్తుంది. ఇంట్లోనే కొన్ని స్వచ్ఛమైన పానీయాలను తీసుకోవడం ఉత్తమం.

-డాక్టర్ అరుణ్‌కుమార్, సూపరింటెండెంట్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు

శుభ్రమైన పండ్లరసాలే తీసుకోవాలి

ఎండలో తిరిగి వచ్చిన వెంటనే నీరు, ఇతర చల్లటి పదార్థాలేవి కూడా తీసుకోవద్దు. వేసవిలో బయట తిరిగి వచ్చిన వెంటనే కొద్దిసేపు నీడలో సేదతీరాలి. దీని వల్ల శరీరం చల్లబడుతుంది. ఆతర్వాత స్వచ్ఛమైన నీరు తాగాలి. ముఖ్యంగా కొబ్బరినీళ్లు, ఇంట్లోనే, పరిశుభ్రమైన దుకాణాల్లో చేసిన పండ్ల రసాలు తీసుకోవడం మంచిది. కూల్‌డ్రింగ్స్, ఓపెన్‌గా తయారు చేసే రసాలకు దూరంగా ఉండడం మంచిది. చిన్న పిల్లలు, విషయంలో జాగ్రత్త వహించాలి.

-డాక్టర్ హర్షవర్ధన్, తిరుపతి



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,860
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,555

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,300
రిటైల్ వెండి గ్రాము	రూ.75.30

ఎస్వీ సంగీత కళాశాలలో పార్ట్‌టైమ్ కోర్సులకు దరఖాస్తులు

తిరుపతి కల్చరల్ : ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో పార్ట్‌టైమ్ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టీటీడీ తెలిపింది. సాయంత్రం కళాశాలలో గాత్రం, వీణ, వేణువు, మృదంగం, వయోలిన్, భరతనాట్యం, కూచిపూడి, హరికథ, ఘటం విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించింది. ఇందులో సర్టిఫికెట్ కోర్సుకు 5వ తరగతి ఉత్తీర్ణులై జూన్ 30వ తేదీ నాటికి 10 ఏళ్ల వయసు నిండినవారు అర్హులని వివరించింది. వీరు రూ.2వేల ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. అలాగే డిప్లొమా కోర్సుకు సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణులై 14 ఏళ్లు వయసు నిండి ఉండాలని, వీరు రూ.2,200 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. కళా ప్రవేశిక కోర్సుకు 8 ఏళ్లు వయసు నిండి ఉండాలని, వీరు రూ.1,500లు ఫీజు చెల్లించాలని సూచించింది. ఆసక్తి గలవారు కార్యాలయ పనివేళల్లో రూ.50లు చెల్లించి దరఖాస్తు పొందవచ్చని స్పష్టం చేసింది. జూన్ 20వ తేదీలోపు దరఖాస్తు సమర్పించాలని కోరింది.. వివరాలకు 0877–2264597, 9848374408, 9440793205 నంబర్లలో సంప్రదించాలని పేర్కొంది.

పార్లమెంట్ భవన ప్రారంభోత్సవంలో ఎంపీ గురుమూర్తి



తిరుపతి మంగళం: అత్యాధునిక సౌకర్యాలు, సకల హంగులతో నిర్మించిన పార్లమెంటు నూతన భవనాన్ని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆదివారం ప్రారంభించారు. ఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ మద్దిల గురుమూర్తి పాల్గొన్నారు. భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఇది ఒక మైలురాయి అని, చారిత్రత్మక ఘట్టంలో భాగస్వామి కావడం చాలా సంతోషంగా ఉందని ఎంపీ తెలిపారు.

నేటి నుంచి జాతీయ స్థాయి రోలర్ స్కీ పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి సమీపంలోని దామినేడు వద్ద సోమవారం నుంచి మంగళవారం వరకు జాతీయ స్థాయి రోలర్ స్కీ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు ఏపీ రోలర్ స్కీ సంఘం ప్రధాన కార్యదర్శి మహ్మద్ హర్షద్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 13 రాష్ట్రాలకు చెందిన 150 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకున్నట్లు వెల్లడించారు.

108లో కవలల ప్రసవం



కవలలను తల్లికి చూపిస్తున్న 108 సిబ్బంది

రాపూరు : మండలంలోని పెనుబర్తికి చెందిన మహిళ ఆదివారం 108లో కవలలను ప్రసవించింది. 108 సిబ్బంది నవీన, అబ్దుల్ ఖాదిర్ కథనం మేరకు.. మహాలక్ష్మి అనే గర్భిణికి 7వ నెలలో పురిటి నొప్పులు వచ్చాయి. దీనిపై సమాచారం అందుకున్న 108 సిబ్బంది వెంటనే గ్రామానికి చేరుకుని గర్భిణిని రాపూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108లోనే ప్రసవం చేశారు. జన్మించిన మగ శిశువులు బరువు తక్కువగా ఉండడంతో నెల్లూరులోని చిన్నపిల్లల వైద్యశాలకు తరలించారు. సకాలంలో స్పందించి నేర్పుగా కాన్పు చేసిన 108 సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు.

వేర్వేరు ఘర్షణల్లో ముగ్గురికి గాయాలు

దొరవారిసత్రం : మండలంలోని మావిళ్లపాడు ఎస్సీ కాలనీలో శనివారం రాత్రి జరిగిన వేర్వేరు ఘర్షణల్లో ముగ్గురు గాయపడ్డారు. వివరాలు.. కాలనీకి చెందిన వాటంబేటి పెద్దసుబ్రమణ్యం, అతడి కుమారుడు చిన్న సుబ్రమణ్యం తమ పొలం అమ్మే విషయంలో గొడవపడ్డారు. పెద్దసుబ్రమణ్యం కుమార్తె కొడుకు నాగచైతన్య వారికి అడ్డువెళ్లాడు. దీంతో నాగచైతన్య గొంతుపై కత్తెర గుచ్చుకుని తీవ్ర గాయమైంది. పెనుగులాటలో పెద్దసుబ్రమణ్యం కూడా గాయపడ్డాడు. అలాగే గ్రామానికి చెందిన సంచి పెంచలయ్యకు అదే గ్రామానికి చెందిన బట్టా నాగరాజు, వెంకటయ్య, శ్రీనివాసులు, చంద్రయ్యకు మధ్య కొన్ని రోజులుగా భూతగాదాలు ఉన్నాయి. ఈక్రమంలో పెంచలయ్యపై నలుగురు కలిసి దాడి చేశారు. 108 వాహనంలో రెండు ఘర్షణల్లో గాయపడిన వారిని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు నాగచైతన్యను మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు, పెంచలయ్యను గూడూరు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీఆర్ఓ మృతి

కోట: పట్టణంలోని కోట క్రాస్ రోడ్డు వద్ద ఓ లాడ్జి గదిలో ఆదివారం కొండాపురానికి చెందిన వీఆర్ఓ రమేష్‌నాయుడు (54) మృతి చెందాడు. చిట్టమూరు మండలం యాకసిరి వీఆర్ఓగా పనిచేస్తున్న రమేష్‌నాయుడు గది అద్దెకు తీసుకుని మద్యం సేవించాడని, ఆ మత్తులోనే మృతి చెందినట్లు లాడ్జి సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ పుల్లారావు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు.అతిగా మద్యం సేవించడం వల్ల గుండెపోటుతో మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీఆర్ఓ రమేష్‌నాయుడు రెండు నెలలుగా విధులకు సైతం హాజరు కావడం లేదని, ఈ క్రమంలో ఉన్నతాధికారులు నోటీసులు సైతం జారీ చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది.

అనుమానాస్పద స్థితిలో ట్రావెల్స్ యజమాని మృతి

పూతలపట్టు: పూతలపట్టు: తిరుపతి జీవకోనకు చెందిన శంకర్ (43)అనే ట్రావెల్స్ యజమాని ఆదివారం అనుమానాస్పదంగా మృతి చెందాడు. గుండెపోటుతో మరణించినట్లు కుటుంబసభ్యులు చెబుతున్నారు. భార్య శిరీష మాత్రం భర్త మృతదేహంపై రక్తగాయాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం నెల్లుట్లవారి పల్లె పంచాయతీ పాళెం ఎస్టీ కాలనీలో శనివారం సాయంత్రం విద్యుదాఘాతానికి గురై ఓ బాలుడు మృతి చెందాడు. భాకరాపేట ఎస్ఐ ప్రకాష్‌కుమార్ కథనం మేరకు.. ఎస్టీ కాలనీకి చెందిన రేణుక ఇంటికి ఆమె అక్క కుమారుడు పులిచెర్ల మండలం పేరసానివారిపల్లె ఎస్టీ కాలనీకి చెందిన హేమంత్ (15) వారం క్రితం వచ్చాడు. శనివారం సాయంత్రం చిన్నాన్న నాగరాజా, చిన్నమ్మ రేణుకతో కలసి అడవికి వెళ్లాడు. పాళెం అటవీ సమీపంలోని రెడ్డి చెరువు వద్ద విద్యుత్ తీగలపై కూర్చున్న గువ్వలను కొట్టేందుకు క్యాటర్‌బాల్ తో రాయి విసిరాడు. దీంతో విద్యుత్ తీగ తెగి మీద పడడంతో హేమంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో నాగరాజా, రేణుక భయంతో బాలుడి మృత దేహాన్ని పక్కనే ఉన్న బండపై పెట్టి ఇంటికి వచ్చేశారు. అడవికి వెళ్లిన తన అక్క కుమారుడు తిరిగి రాలేదని గ్రామంలో చెప్పారు. . గ్రామస్తులు ఆదివారం బాలుడిని వెతుక్కుంటూ వెళ్లగా హేమంత్ మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. కాళ్లు, వీపుపై కాలిన గాయాలు ఉండడంతో నాగరాజా, రేణుకను విచారించారు. దీంతో అసలు విషయం బయటపడింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



హేమంత్ మృతదేహం

కాలువను కబ్జా చేసిన టీడీపీ నేత

– ఆక్రమణలను తొలగించిన అధికారులు

సత్యవేడు: దాసుకుప్పం– ఊత్తుకోట సరిహద్దులోని కాలువ పోరంబోకు స్థలంలో ఆక్రమణల తొలగింపు ఆదివారం రెండో రోజు కూడా కొనసాగింది. ఆ స్థలంలో అక్రమంగా నిర్మించిన దుకాణ సముదాయాన్ని రెవెన్యూ , పోలీసు అధికారుల పర్యవేక్షణలో తొలగించారు. ముందుగా తహసీల్దార్ శ్రీదేవి, వీఆర్ఓ శేఖర్, సర్వేయర్ గిరి ఆధ్వర్యంలో కాలువ పోరంబోకు స్థలాన్ని గుర్తించారు. సర్వే నంబర్ 8–5లో 10సెంట్లు, 8–3ఏలో ఆరు సెంట్లు, 8–2ఏలో నాలుగు సెంట్లు, 8–1ఏలో రెండు సెంట్ల భూమిలో ఉన్న ఆక్రమణలను తొలగించారు. దాసుకుప్పం గ్రామానికి చెందిన టీడీపీ నేత, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కె. సుందరరామిరెడ్డి అక్రమంగా దుకాణ సముదాయం నిర్మించుకుని అద్దెలు వసూలు చేసినట్లు అధికారులు వెల్లడించారు. దీనిపై అదే గ్రామానికి చెందిన శరవణకుమార్ హైకోర్టును ఆశ్రయించడంతో ఆక్రమణ తొలగించాలని తీర్పు వచ్చిందని వివరించారు. టీడీపీ నేతలు ఎన్ని అవాంతరాలు సృష్టించినా అధికారులు లెక్కచేయకుండా అక్రమ కట్టడాలను తొలగించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



జేసీబీతో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం


ఏఓలకు పదోన్నతులు

– అడహక్ పద్ధతిలో ఎంపీడీఓలుగా నియామకం

నెల్లూరు(పొగతోట): పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి వివిధ మండలాల్లో పరిపాలనాధికారులుగా, ఈఓపీఆర్డీలుగా పనిచేస్తున్న వారికి అడహక్ పద్ధతిలో ఎంపీడీఓలుగా పదోన్నతులు కల్పించి నెల్లూరు, ప్రకాశం, తిరుపతి జిల్లాలకు బదిలీ చేస్తూ పీఆర్ ఉన్నతాధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏఓలకు సంబంధించి ఎస్.జగదీష్‌ను నెల్లూరు నుంచి ప్రకాశం జిల్లాకు, డీవీ నరసింహారావును తిరుపతికి, కె.షాలెట్‌ను తిరుపతికి, పి.ప్రసన్నకుమారి, వైవీ నాగేశ్వరప్రసాద్‌ను ప్రకాశం జిల్లాకు బదిలీ చేశారు. ఈఓపీఆర్డీలకు సంబంధించి ప్రకాశం జిల్లాలో పనిచేస్తున్న ఏవీ కృష్ణామోహన్ రావు, రంగసుబ్బారాయుడును నెల్లూరుకు, తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న జి.శ్రీనివాసరావును నెల్లూరుకు, నెల్లూరులో పనిచేస్తున్న ఎస్.వసుంధర, బి.కల్పన, శ్రీనివాసులురెడ్డి, జలజాక్షిని ప్రకాశం జిల్లాకు బదిలీలు చేశారు.

చంద్ర పుష్కరణి బావిలో జారిపడ్డ భక్తురాలు

రేణిగుంట: శ్రీకాళహస్తి దేవస్థానం జలవినాయకుని సమీపంలో ఉన్న చంద్రపుష్కరణి వద్ద ఉన్న బావిలో ఆదివారం రాత్రి ఓ మహిళా భక్తురాలు ప్రమాదవశాత్తు జారిపడింది. వెంటనే అక్కడ ఉన్న ఆలయ సెక్యూరిటీ సిబ్బంది ఆమెను బావిలో నుంచి బయటకు తీసి రక్షించారు. వివరాల్లోకి వెళితే... తెలంగాణ రాష్ట్రం, అదిలాబాద్ పట్టణానికి చెందిన ఓ కుటుంబంలోని నలుగురు ఆదివారం రాత్రి శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. దర్శనానంతరం వారిలో సరస్వతి(38) అనే మహిళ ఆలయం బయటకు వచ్చి కార్ పార్కింగ్ చేసిన జలవినాయక ఆలయ సమీపంలో మూత్ర విసర్జన కోసం చంద్రపుష్కరణి వద్దకు వెళ్లింది. చీకట్లో ఆమెకు కనించకపోవడంతో పుష్కరిణి వద్దనున్న బావిలో జారిపడింది. బావిలో నీళ్లు ఉండడంతో శబ్దం వినిపించింది. వెంటనే అక్కడున్న ఆలయ సెక్యూరిటీ సిబ్బంది ఆమెను రక్షించారు. దేవస్థానం అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆమెను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు హుటాహుటిన ఆస్పత్రికి చేరుకుని ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆమెకు కుడికాలు విరిగినట్లు వైద్యులు తెలిపారు. ఎలాంటి ప్రాణాపాయం లేదని వివరించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఆమెను తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యఖర్చులు ఎంతైనా దేవస్థానమే భరిస్తుందన్నారు. అలాగే పుష్కరిణి వద్ద బావిపై భాగంలో ఐరన్ గ్రిల్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని చైర్మన్ స్పష్టం చేశారు.



భక్తురాలి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీస్తున్న ఆలయ చైర్మన్

● కొండంత క్యూ



తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శ్రీవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులతో ఆదివారం తిరుమల కిక్కిరిసింది. - తిరుమల